AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## 24న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, గాంధారి:** ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్దార్ నాయక్ పేర్కొన్నారు. గాంధారిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జామ్‌మేళాలో దాదాపుగా 70 కంపెనీలు 5000 వేల పైగా ఉద్యోగాలు కల్పించనున్నాయన్నారు. 24న ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు.


23-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## సొసైటీ ద్వారా రైతులకు యూరియా అందజేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్ :** సొసైటీ ద్వారా రైతులకు యూరియా అందజేయాలని పట్టణానికి చెందిన ఆరు పంతల సంఘం రైతులు కోరారు. ఆదివారం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు యూరియా బుక్ కావడం లేదన్నారు. సొసైటీ ద్వారా రైతుల పంట పాసు బుక్ ద్వారా ఒక్కో రైతుకు ఎకారానికి మూడు బస్తాల యురియాను ఇప్పించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ ఫోన్ చేసి సమస్య తెలియజేయగా మంత్రి స్పందిస్తూ యాప్‌లో సాంకేతిక సమస్య ఉందని, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు కలికోట గంగాధర్, యాదాద్రి భాస్కర్, ఆరు పంతల రైతులు పాల్గొన్నారు.




## 22ఏ భూముల అంశంపై చర్చకు సిద్ధమా..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** 22ఏ భూముల అంశంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, ఇందూరులో ఎక్కడికి రమ్మన్నా అక్కడికి వస్తానని దినేష్ కులాచారి ప్రకటించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ అంశంపై పూర్తి అవగాహన, విషయ పరిజ్ఞానం ఉన్న కాంగ్రెస్ నాయకులు ఎవరైనా చర్చకు రావచ్చని దినేష్ కులాచారి పేర్కొన్నారు. తాను అన్ని విషయాలను ఆధారాలతో సహా వివరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు ఈ అంశంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఒకవేళ చర్చకు రాకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తామని తెలిపారు.

# పోచారం దారెటు..?



- ఓవైపు ప్రభుత్వంపై పొగడ్తలు.. మరోవైపు నిధులపై విమర్శలు
- సస్పెండ్ చేయాలని పీఏసీ ఎదుట ఏనుగు వర్గీయుల ధర్నా
- సస్పెండ్‌పై ఎటు తేల్చుకోలేని పార్టీ అధిష్టానం
- క్యాడర్ ఆగమాగం..యాక్టివ్ అవుతున్న ఏనుగు రవీందర్ రెడ్డి

**ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీలో గందరగోళం నెలకొంది. పార్టీలో నేతలు ఎవరికి వారే అన్నట్టుగా కొనసాగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రెండు జిల్లాల పరిధిలో ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

ప్రభుత్వ సలహాదారుగా కొనసాగుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి అంశం ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. కొద్దిరోజులుగా బాన్సువాడ నియోజకవర్గంలో చిత్ర విచిత్రమైన రాజకీయాలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోకి ఏనుగు రవీందర్ రెడ్డి ఎంట్రీ తర్వాత ఇక్కడి రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఏకంగా పోచారంను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పీఏసీ కమిటీ ముందు ధర్నా చేపట్టడం చర్చనీయాంశంగా మారగా అధిష్టానం నిర్ణయం ఎలా ఉంటుందోనన్న చర్చ సాగుతోంది.

### రసవత్తరంగా బాన్సువాడ రాజకీయం..

బాన్సువాడ రాజకీయాలు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్నాయి. మాజీ స్పీకర్, బాన్సువాడలో తిరుగులేని నేతగా పేరు తెచ్చుకున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే కాదు, రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అటు బీఆర్ఎస్ కాదు, ఇటు కాంగ్రెస్ కాదు అన్నట్టుగా ఆయన రాజకీయ ప్రస్థానం త్రిశంకులో పడింది. దాంతో అసలు బాన్సువాడలో ఏం జరుగుతోందన్న చర్చ సాగుతోంది. ఒకప్పుడు బాన్సువాడకు పెద్ద దిక్కుగా ఉన్న పోచారం ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితిలో ఉండడం కార్యకర్తలను కూడా అయోమయంలోకి నెడుతోంది.

### పార్టీలో ఉంటేనే పదవి..


రాజకీయంగా ఇది తెలివైన స్టెప్‌గా కొందరు భావిస్తుంటే, ఇది నమ్మకద్రోహం అని మరికొందరు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో లేనప్పుడు ప్రభుత్వ సలహాదారు పదవిలో ఎందుకు కొనసాగుతున్నారనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సలహాదారులుగా పార్టీకి చెందిన వారికే అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశం మరింత చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో లేని వ్యక్తికి ప్రభుత్వ పదవి ఎలా ఇస్తారని, ఇది పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం కాదా అనే ప్రశ్నలను ఏనుగు వర్గీయులు లేవనెత్తుతున్నారు.

### ప్రభుత్వంపై పొగడ్తలు.. నిధులపై విమర్శలు

పోచారం తీరు క్యాడర్‌ను తీవ్ర గందరగోళంలోకి నెడుతోంది. ఒకవైపు ప్రభుత్వం నుంచి తన నియోజకవర్గానికి నిధులు రావడం లేదని బహిరంగ వేదికలపై ఆరోపిస్తున్నారు. సీఎం చెప్పినా మంత్రులు స్పందించడం లేదని, ఫలితంగా పనులు నిలిచిపోతున్నాయని బహిరంగంగానే చెబుతున్నారు. మరోవైపు అదే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంచి పాలన అందిస్తోందని కితాబిస్తున్నారు. ప్రభుత్వ సలహాదారు హోదాలో ఉండి ప్రభుత్వాన్ని విమర్శించడం ఏమిటనే ప్రశ్న క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. ఈ ద్వంద్వ వైఖరి వెనుక ఆంతర్యం ఏమిటనేది ఎవరికీ అర్థం కావడం లేదు. ఇది ఒత్తిడి పెంచే వ్యూహమా లేక అసంతృప్తికి సంకేతమా అనే చర్చ జరుగుతోంది. సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తూ, అదే ప్రభుత్వ పథకాలను పొగడటం వెనుక రాజకీయ వ్యూహం ఉందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### పీఏసీ ముందు ధర్నా..

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ఎమ్మెల్యే పోచారానికి వ్యతిరేకంగా నగరంలో ఏనుగు వర్గీయుల ధర్నా

### పార్టీపై కన్ఫ్యూజన్..

అసలు కన్ఫ్యూజన్ అంతా కండువా దగ్గరే మొదలైందన్న చర్చ సాగుతోంది. తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, కప్పుకున్నది జాతీయ జెండా కండువా అని పోచారం పలుమార్లు చెబుతూ వస్తున్నారు. తాను కాంగ్రెస్‌లో చేరలేదని చెబుతున్నారే తప్ప, తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని మాత్రం ఎక్కడా చెప్పడం లేదు. దీంతో ఆయన అసలు ఏ పార్టీలో ఉన్నట్టు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు బీఆర్ఎస్ కాకుండా, ఇటు కాంగ్రెస్ కాకుండా మధ్యలో ఉండడం వల్ల ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని విశ్లేషకులు అంటున్నారు.

ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) మీటింగ్ ముందు ఏనుగు రవీందర్ రెడ్డి వర్గీయులు ధర్నాకు దిగడం కలకలం రేపింది. పోచారం వల్ల బాన్సువాడలో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పీఏసీ ముందే ధర్నా చేయడం ద్వారా అధిష్టానానికి తమ నిరసనను తెలియజేయాలని వారు భావించినట్లు తెలుస్తోంది.

### పోచారంనకు చెక్ పెట్టేలా స్కెచ్..?

ఈ మొత్తం వ్యవహారంలో ఏనుగు రవీందర్ రెడ్డి తెరవెనుక రాజకీయం చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బాన్సువాడలో తన రాజకీయ భవిష్యత్తుకు పోచారమే అడ్డుగా ఉన్నారని ఏనుగు భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. పోచారం రాజకీయ జీవితానికి పూర్తిగా చెక్ పెట్టేలా ఏనుగు ప్లాన్ చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీఏసీ ముందు ధర్నా చేయించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. బాన్సువాడలో పట్టు కోసం ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ నడుస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

### ఎటూ తేల్చుకోలేని పార్టీ అధిష్టానం

పోచారంపై సస్పెన్షన్ వేటు వేసే అవకాశం లేదనే చర్చ పొలిటికల్ వర్గాల్లో సాగుతోంది. ఆయన అధికారికంగా కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని చెప్పడమే ఇందుకు నిదర్శనంగా చూపిస్తున్నారు. సస్పెండ్ చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని, అందుకే అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోందని తెలుస్తోంది. మరోవైపు పోచారం బీఆర్ఎస్ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతుండగా.. ఆ పార్టీలో కూడా కొందరు ఆయనను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.



## పీఆర్సీని తక్షణమే అమలుచేయాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో రావాల్సిన పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు, రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. ఉద్యోగులకు అత్యంత అవసరమైన హెల్త్ కార్డులను మంజూరు చేసి ఉద్యోగులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముల్క నాగరాజు, శివకుమార్, చక్రధర్, దేవరాజు, జె.శ్రవణ్ కుమార్, రాజ్యలక్ష్మి, రమణ కుమార్, రాజారెడ్డి, రాజమణి పాల్గొన్నారు.



## పీసీసీ చీఫ్‌ను కలిసిన కల్లెడి కాంగ్రెస్ నాయకులు

**అక్షరటుడే, ఆర్మూర్ :** టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను కల్లెడి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై మహేష్‌కుమార్ గౌడ్ నాయకులకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ సెక్రటరీ దేగ పోశెట్టి, కల్లెడి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోండ్రా శివకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నీలగిరి శ్రీనివాస్, బండారి రమేష్, రొండ్ల నర్సారెడ్డి, పులిమంటి ప్రకాష్, సిరికొండ మహేష్, అభిబ్, మామిడిపల్లి రవికుమార్, ఐలి గంగారం, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యో రాజశేఖరా.. ఏమిటీ దుస్థితి..!

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం కామారెడ్డి జిల్లా కేంద్రంలో దయనీయ స్థితిలో దర్శనమిస్తోంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పక్కన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల మధ్య, చిరిగిపోయిన ఫ్లెక్సీల మధ్య మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. పీఠం పగుళ్లు పట్టి ఇటుకలు బయటకు వచ్చి, చుట్టూ పరిశుభ్రత లేకుండా ఉండటంతో అక్కడ వైఎస్ఆర్ విగ్రహం ఉందన్న సంగతే చాలామంది మర్చిపోయారు. నిత్యం జనాల రద్దీ ఉండే ఆ విగ్రహం పక్కనే ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభానికి ప్రధాన లైన్ ఉండటంతో ఆ ప్రాంతంలో ప్రమాదం పొంచిఉంది. వైఎస్ఆర్ అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించడానికి వెళ్తే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం కూడా ఉంది. అలాగే మూలమలుపు వద్ద పండ్ల దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ పోలీసులు నిలబడే స్టాండ్‌ను కూడా విగ్రహానికి ఆనించి నిర్లక్ష్యంగా వదిలేశారు. మహానేత వైఎస్ఆర్ జయంతి, వర్ధంతి సమయాల్లో కూడా ఆ విగ్రహానికి నివాళులు అర్పించిన దాఖలాలు చాలా తక్కువేనన్న ప్రచారం ఉంది. నాటి వైఎస్సార్‌టీపీ నాయకులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఇప్పుడు ఆ పార్టీ నాయకులే కామారెడ్డిలో లేరు. దాంతో విగ్రహాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి ఎన్నో పథకాలతో రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించిన నాయకుడు వైఎస్ఆర్. కాంగ్రెస్ పార్టీని రెండుసార్లు అధికారంలోకి తెచ్చిన ఆ మహానేత విగ్రహానికి ఇంత దుస్థితి పట్టడం కాంగ్రెస్ శ్రేణులకే అవమానకరమని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున జిల్లా కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించి ఈ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో అందరూ గుర్తుంచుకునేలా, గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## కష్టపడ్డ కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత..: పీసీసీ చీఫ్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నగరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కింద్దిస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తలకు కూడా పదవులు ఇవ్వాలని డిమాండ్ వస్తోందని, పదవుల భర్తీలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని చెప్పారు. 70 శాతం పదవులను పాత కార్యకర్తలకే ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జీలతో కలిసి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏఐసీసీ స్థాయిలో అనుసరిస్తున్న విధానం కూడా ఇదే ఫార్మాట్‌లో ఉందన్నారు. గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డ వారికి పదవుల్లో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌తో పాటు పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న కార్యకర్తలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని పీసీసీ చీఫ్ తెలిపారు. అన్ని కమిటీలను భర్తీ చేస్తామని, ఇందులో 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. మార్కెట్ కమిటీలకు సంబంధించి అప్రూవల్ ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించినట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. 'అధికారం కార్యకర్తల కృషి వల్లే వచ్చింది. కార్యకర్తల కష్టాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరిచిపోదు' అని వ్యాఖ్యానించారు. ఇచ్చిన మాట ప్రకారం పీసీసీ అధ్యక్షుడిగా తన 35 ఏళ్ల కల అయిన ఇంజినీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాలను సాధించుకున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లతో తిరిగి అధికారంలోకి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కార్పొరేషన్ ఛైర్మన్లు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, సునీల్ కుమార్ రెడ్డి, విపుల్ గౌడ్, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముప్కాల్ వార్డు మెంబర్ల కమిటీ అధ్యక్షుడిగా కంచు సతీష్



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండల వార్డు మెంబర్ల కమిటీ అధ్యక్షుడిగా కంచు సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వార్డు మెంబర్ అసోసియేషన్ కమిటీ ఆదివారం ప్రకటనలో వివరాలు వెల్లడించింది.తెలంగాణ వార్డు మెంబర్ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షురాలు నాంపల్లి జ్యోతి ఆదేశాల మేరకు జిల్లా వార్డు మెంబర్ కమిటీ ఇన్‌చార్జ్ కర్బ సాయిలు, కోఇన్‌ఛార్జి సిరికొండ కళ్యాణ్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా సురేష్, దీపక్, రాజు, కార్యదర్శిగా ప్రదీప్, కోఆర్డినేటర్లుగా రాజేశ్వర్, మల్లయ్య, సలహాదారులుగా సాయిలు, సవిత, అంజలి, రాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా సవిత, మయూర్, రాజు, సోని, గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కోరట్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని కోరట్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఇళ్లులేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందిస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతే ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి డా. జాహుర్, నాయకులు నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'లయన్స్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మైదానంలోని వాకర్లకు మధుమేహ పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ జిల్లా అదనపు కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ తగదని అన్నారు. ఆరోగ్యం కాపాడుకునేందుకు వ్యాయామం, వాకింగ్, యోగా వంటివి చేయాలన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా కార్యదర్శి డి.యాదగిరి, అదనపు కోశాధికారి కరిపె రవీందర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర బాబు, చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్, పూర్వాధ్యక్షుడు ఇరుమల శివలింగం, బింగి దరంవీర్ తదితరులు పాల్గొన్నారు.



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కలకలం రేపుతోంది. మొత్తం ఓటర్లలో మూడో వంతు మంది ఏదో ఒక వివరణ ఇవ్వాల్సిందేనని అధికారులు తేల్చారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 6,17,145 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 4,32,405 మంది, కామారెడ్డి జిల్లాలో 1,84,740 మంది ఉన్నారు. – అక్షరటుడే, ఎల్లారెడ్డి**




# అలర్ట్‌గా లేకుంటే మీ ఓటు డౌటే..!

- 6,17,145 మంది ఓటర్లకు నోటీసులు
- స్పందించకపోతే అంతే సంగతులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- ఇంకా అందని నోటీసులు

బీఎల్‌వోలు ఇంటికి వచ్చి ఇచ్చే నోటీసులకు తప్పనిసరిగా స్పందించాల్సిందే. రిప్లై ఇవ్వకపోయినా, అడిగిన పత్రాలు ఇవ్వకున్నా ఓటు డౌటేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక లోపాలు, వ్యక్తిగత వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న 'అనామలీస్', 2002 జాబితాతో మ్యాపింగ్ కాని 'నో మ్యాపింగ్' కేటగిరీలో ఉన్న వారికి ఈ నోటీసులు ఇస్తున్నారు.

### స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్..

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌లో పేరు ఉన్నంత మాత్రాన ఓటు భద్రంగా ఉన్నట్టు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నోటీసు అందుకున్న ఓటర్లు నిర్దేశిత గడువులోగా స్పందించి సరైన ఆధారాలు సమర్పించకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి మలిదశ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే నోటీసులు ముద్రించే ప్రక్రియ మొదలైంది. ప్రింట్ అయిన నోటీసులను తహశీల్దార్ల ద్వారా ఓటర్లకు అందిస్తున్నారు. సెప్టెంబర్ 20 లోపు ఈ విచారణ ప్రక్రియ ముగిసి, అక్టోబర్ 19న ఫైనల్ జాబితా విడుదల కానుంది.

### ఆధారాలు చూపితేనే..

నోటీసులు అందుకున్న వారు తమకు కేటాయించిన తేదీలో ఏఈఆర్‌ఓలుగా ఉన్న తహశీల్దార్ల ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది. 2002లో తమతో పాటు తమ కుటుంబ పెద్దలకు సంబంధించిన ఓటు వివరాలను ఆధారాలతో సహా చూపించాలి. నిరూపణ అయిన తర్వాత డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

### ఓటర్లదే బాధ్యత..

ప్రస్తుత 'సర్' ప్రక్రియలో లోపాలను సరి చేసుకోవడం ఓటర్ల ప్రాథమిక బాధ్యతగా మారింది. అధికారుల నోటీసులకు సరైన సమాధానం ఇచ్చి, ఆధారాలు సమర్పిస్తే ఓటు భద్రంగా ఉంటుంది. లేకుంటే తుది జాబితా నుంచి పేరు శాశ్వతంగా తొలగిస్తారు.

### ఇలా చెక్ చేసుకోవచ్చు

ఓటర్లు తమ స్టేటస్‌ను https://electoralsearch.eci.gov.in వెబ్ సైట్‌లో ఎపిక్ నంబర్‌తో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు. తాను 'అనామలీ' కేటగిరీలో ఉన్నారా లేదా అనేది తెలుసుకుని, పాస్ పోర్ట్, ఆధార్ కార్డు తదితర ఆధారాలు రెడీగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ అర్బన్ 1,09,639ఓటర్లకు నోటీసులు అందనున్నాయి. అలాగే రూరల్‌లో 80,026 మందికి, బాల్కొండలో 65,380 మందికి, ఆర్మూర్‌లో 63,179మందికి, బోధన్‌లో 61,262 మందికి, బాన్సువాడలో 52,919 మందికి తాఖీదులు అందుతాయి.

### కామారెడ్డిలో అత్యధికం

జిల్లావ్యాప్తంగా 810 పోలింగ్ కేంద్రాల పరిధిలో 19,157 మంది నో మ్యాపింగ్, 1,65,583 మంది అనామలీస్ కేటగిరీలో ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా కామారెడ్డి మండలంలో 38,680 మందికి, అత్యల్పంగా మహ్మద్ నగర్‌లో 2,603 మందికి నోటీసులు రానున్నాయి.



జెండా బాలాజీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

## భక్తిశ్రద్ధలతో జెండా బాలాజీ జాతర..

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలో జెండా బాలాజీ జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనెలహరి రఘు, ఈఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ జెండాను అంకాపూర్ గ్రామస్తులకు అందజేశారు. అంకాపూర్‌లో 20 రోజుల పాటు పూజలు అందుకున్న తర్వాత జెండా అటు నుంచి జక్రాన్‌పల్లి మండలం అర్గుల్, సిర్నపల్లి గ్రామాల మీదుగా చివరికి తిరుమలకు చేరుకుంటుంది.



జెండా బాలాజీని దర్శించుకున్న ఛైర్‌పర్సన్ లహరి



## అలుగు పారుతున్న ఇందల్వాయి పెద్దచెరువు

ఇటీవల కురిసిన వర్షా లతో ఇందల్వాయి గ్రామంలోని పెద్ద చెరువు నిండుకుండలా మారింది. ఆదివారం ఉదయం నుంచి చెరువు మత్తడి దూకుతోంది. గాంధారి, యాచారం, మంచిప్ప అటవీ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండింది. చెరువు అలుగు పారుతుండటంతో ఇందల్వాయి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలుగు నుంచి బయటకు వస్తున్న నీరు ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టులోకి చేరుతోంది. చెరువు నిండటంతో ఆయకట్టు రైతుల్లోనూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు పరిసర ప్రాంతాలను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

- అక్షరటుడే, డిచ్‌పల్లి

## రహదారికి మరమ్మతులు..



'నరకప్రాయంగా కామారెడ్డి –బాన్సువాడ రోడ్డు' అని శీర్షికతో 'అక్షరటుడే'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాత్కాలికంగా మట్టితో మరమ్మతులు చేపట్టారు. గాంధారి నుండి కామారెడ్డి వైపు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో 'అక్షరటుడే'లో కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు తాత్కాలికంగా గుంతలుగా ఏర్పడిన చోట మట్టితో గుంతలను పూడ్చివేశారు. కాని మట్టితో గుంతలు పూడిస్తే తిరిగి గుంతలు తేలే అవకాశం ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- అక్షరటుడే, గాంధారి

## రైతువేదిక ప్రాంగణంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఎంపీడీవో ఆఫీస్‌లోని రైతువేదిక ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు వేదిక ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒకగంట అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 68వ వారానికి చేరుకుందన్నారు. ఇందులో భాగంగా రైతుల సమస్యలపై చర్చించే రైతు వేదిక ఆవరణను శుభ్రం చేశామన్నారు. రైతు వేదిక వద్దకు వెళ్లేందుకు సరైనమార్గం లేక లేక పిచ్చిమొక్కలతో ఆవరణ మొత్తం నిడిపోయిందన్నారు. దానిని తొలగించి వెళ్లేందుకు మార్గం సుగుమం చేశామన్నారు. ఇదేవిధంగా ప్రతివారం ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, వేద జీడి రాజ్ కుమార్, కుకింగ్ నరేష్, గణేష్, రమేష్, వేణు, కృషివర్ధన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిరుద్యోగ యువతీ యువకులకు తెలంగాణ పోలీస్ శాఖ తరపున కానిస్టేబుల్, ఎస్సైల ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరంలో యువతకు నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్ కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆదివారం కమిషనరేట్ పరిధిలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడు డివిజన్లలో ఈ పరీక్ష జరిగిందన్నారు. నిజామాబాద్ డివిజన్‌కు సంబంధించి విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కాలేజీలో, ఆర్మూర్ డివిజన్‌కు క్షత్రియ ఇంజినీరింగ్ కాలేజీలో, బోధన్ డివిజన్‌కు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీలో పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. పరీక్షా ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించారని వివరించారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై నియామక పరీక్షలకు అవసరమైన రాత పరీక్ష, ఫిజికల్ ఈవెంట్స్, తదితర అంశాల్లో సమగ్ర శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ, ట్రాఫిక్, సీసీఎస్, ఏఆర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ విభాగాలకు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

